# "కంచెయే చేనుమేస్తే....?!"

"వల్లపురెడ్డి"

దారి కిరు ప్రక్కలా వచ్చ పచ్చని చేలు నేత్రోత్సవం గావిస్తూంటే ఊరివైపు చకచకా నడచి వెడుతున్నాను. పొలాల నిండా వివిధ సస్యాలు పరిపక్వ దశకి వచ్చి, సేవ్యకుల ముఖాల్లోని మంద హాసాలకు అమ్రేడితాలుగా కన్పడుతున్నాయి. పుడమి తల్లి విందు చూలాల్లాగు గోచరిస్తూంది.

అదేం విశేషమో కాని, నేను స్టేషనులో రైలుదిగి, మా ఊరికి ఆరుమైళ్ళు కాలినడకని బయలుదేరిన వేళల్లో ప్రతిసారీ ఏదో ఒక విషాద గాథని ఆకర్ణించాల్సి వచ్చింది. ఇంటికి ఎన్నడూ కులాసాగా పోలేదు. కర్ణశ్రుతమైన విషాద గాథ గుండెను పుండు చేశాక కలకల లాడుతున్న వదనంతో ఇంట్లో ఎట్లా అడుగు పెట్ట గలుగుతాను? అది ప్రయత్నించినా సాధ్యపడని పని నాకు. ఎప్పుడెప్పుడేయే గాథలు ఎవరెవరి ద్వారా విన్నానో చెప్పాలంటే ప్రస్తుతం చెప్పాల్సిన విషయం మాటుపడి పోతుంది. అంచేత వర్తమాన గాథే మీముందు పెడ్తాను. గత గాథల్ని మరోమారెప్పుడేనా వివరిస్తాను.

స్టేషనునించి మా ఊరికి పాదచారినై పయనించే వేళా విశేషాన్ని భంగ పరచకండా ఈసారికూడా అంతే ఐంది. ఎన్ని దుఃఖగాథలు విన్నా, నేను కన్నీటి తర్పణంతో సానుభూతి చూపేకంటే ఏమీ చెయ్యలేని అసమర్థుణ్ణండీ!

అవునండి! మొదటికి వస్తాను. దారి కిరు ప్రక్కలా పలాశ శలాకల్లా నిలుచున్న మొక్కల మధ్య నడుస్తున్నాను; నేను నడుస్తున్నది కాలి బాట. ఆ చేను దాటితే బండిదారి వస్తుంది... వచ్చింది కూడా.

బండిదారి మీద నడుస్తున్నాను. అలా ఒక రెండు ఫర్లాంగులు నడిచాను. దారికి ఎడంప్రక్కన అల్లంతదూరాన పచ్చని చేలమధ్య గడ్డిమొలచిన బీడుఉంది. ఎవరూ వ్యవసాయం చేసేవాళ్లు లేక అదలా విడిచిపెట్టబడి ఉండొచ్చు. ఆ బీటిలో గొఱ్ఱెల కాపరులు తమ జీవాలను మేపుకుంటున్నారు. ఆ బీడుకూ, దారికీ మధ్య ఉన్నది కంది చేను. అన్ని చేలలోనూ కాపలా కాస్తున్నారు. కాని ఆ కంది చేనుకు మాత్రం ఎవ్వరూలేరు. ఆ వీలు చూసుకునే కామాలు గొఱ్ఱెలు పచ్చని కంది చేనుకు చిచ్చు పెడుతున్నా కాపరులు చూస్తూ కూర్చున్నారు. నేను దూరంనించే ఈ దృశ్యాన్ని చూశాను. గొల్లలపై కోపమూ, యజమానిమీద జాలీ ఏకకాలంలో కలిగినై నాకు. అయితే మాత్రం ఏం చెయ్యగలుగుతాను? గొల్లలను మందలించనూ లేను; యజమానికి తెలియజేయనూ లేను. ముందుకు నడిచాను. ఆ చేను ప్రక్కకి వచ్చాను. దాని ప్రక్కనే, దారికి కుడివైపున, మంచెమీద నిలుచుని జొన్న చేలో పరిగె పిట్టలను తోలుతున్న ఒకాయన్ను చూసి, "ఏమయ్యా! ఈ చేని యజమాను లెవరూలేరా?" అనడిగాను.

అతను నాకేసి చూడకండానే, "ఉన్నారు," అన్నాడు క్లుప్తంగా. తన పనిని తాను యథావిధిగా నిర్వర్తిస్తూ.

"మరెక్కడున్నాడు? గొల్లవాళ్ళు చేనంతా మేపుకు పోతూఉంటే?" ఉండబట్టలేక ప్రశ్నించాను. "ఇంటికడున్నాడు," సమాధాన మిస్తూ ఒకక్షణంపాటు నాకేసిచూసి, తిరిగీ తన పనిలో నిమగ్నుడయ్యాడు. అతడంతటి క్లుప్తమైన సమాధానా లెందుకిస్తున్నాడో నాకర్థం కాలా.

"నువ్వైనా ఒక కూత వెయ్యరాదూ? వాళ్ళు చేనంతా మేపుకు పోతున్నారు" అని యాచించాను దీనంగా.

కథానిక

నా ధోరణి అతనికి వినుగెత్తించిందిగావును. ఏదో బాధపడుతున్నట్లుగా ముఖ కవళికను వికృతంగా

మార్చి, "నేనింకా నాలుగు రోజులు బ్రతకదల్చుకున్నాను," అని ఏదో రహస్యం వచిస్తున్నట్టుగా మంచెమీదినించి వంగి నా చెవి దగ్గర మెల్లిగా ఊదాడు. అతని ప్రవర్తన నాకు అయోమయంగా కన్పడింది. శూన్యంగా అతణ్ణి చూశాను.

నాపరిస్థితి గమనించాడుకామాలు, ముఖంలో కొంచెం ప్రసన్నతని ప్రదర్శించి, "తీరికఉంటే కొంచం తడవాగు—" అన్నాడు.

ఏదో గొప్పకారణమే ఉంటుందనుకున్నాను ప్రతి ఘటనకీ కారణం ఏమైఉంటుందో తెలిసికోవడంలో నాకు జిజ్ఞాస అధికం. అతని మాట ప్రకారం ఆగాను.

ఒక పదినిమిషాలదాకా అతను నాదగ్గరేమీ మాట్లాడలేదు. వడిసెలలో గులకరాళ్లు పెట్టి రువ్వి జొన్నమొక్కలమీద వాలిన పిట్టలని తోలసాగాడు. తరువాత అన్నివైపులా తేరిపార చూశాడు. ముఖ్యంగా గొల్లలు జీవాల్ని మేవుతున్న బీటికేసి చూశాడు. ఆ సమయంలో వాళ్లు మందని తరలించుకుపోతున్నారు. "రా, ఇలా మంచెమీదికెక్కి కూర్చో బాబూ!" అని పిల్చాడతడు.

చేతనున్న సంచిని మంచె కొఱకు నాటిన ఈతమొద్దులలో ఒకదానికి తగిలించి, మంచె ఎక్కి కూర్చున్నాను. అతనుకూడా కూర్చుని మోదుగాకు చుట్టలో పొగాకు దట్టించసాగాడు. "నీదేవూరు బాబూ?"—ప్రశ్నించాడు.

"ఈ ప్రక్కన ఉన్నదే!"

"అప్పన్న పల్లెనా?"

"అవును."

"ఎవరి కొడుకువి?"

"రామయ్యగారి కొడుకుని."

"ఒహెూ! మోతుబరి రామయ్యకొడుకువా?"

అవునన్నట్లు తలూపాను.

"మరలా చెప్పవేం? రామయ్యఅంటే ఎవరో అనుకున్నాను."

"మా నాన్నగారు తెలుసా?"—ఈసారి నేనాశ్చర్యపడ్డాను.

"ఏదో చిన్నప్పటి దోస్తి. నీ పేరూ?"

ఇలా సంభాషణ సాగుతూ పోయింది. సంభాషణతోపాటు ఆయన చుట్ట ముట్టించడమూ, పీల్చడమూ సాగింది. నేనేంచేస్తున్నదీ, వివాహం ఐందా లేదా? ఇత్యాది ప్రశ్నలన్నీ అడుగుతూపోయాడు. నాకేమో అసలు విషయాన్ని గురించిన జిజ్ఞాస ఎండాకాలపు దాహంలా పెరిగిపోసాగింది.

"ఏమిటీ? కొంచం ఆగమని చెప్పి, ఏమీ చెప్పడంలేదు?"—ఆయన్ను త్వరపెట్టింది నాలోని కలవరం.

"ఆఆఁ, చెప్తాను బాబూ! ఆ చేను గురించే కాదా నువ్వడిగింది? చెబితే ఏం లాభం? విని నువ్వేంచేస్తావు?...." ఆయన ప్రశ్నాపూర్వకమైన దోరణి వినేసరికి అసలు విషయం చెప్పడేమోనని బెంగపడ్డాను. కాని అలా జరుగలేదు. "....సరే, నీ కోరిక మాత్రం ఎందుకు కాదనాలి? చెప్తాను." అనేసరికి నా హృదయం చివురించింది. శ్రద్ధతో వినసాగాను.

ఆయన మొదలెట్టాడు: "చూడు బాబూ! మా ఊరుందే, మహా చెడ్డఊరు. ఎవరైనా కడుపులో చల్లకదలకండా బ్రతుకుతున్నారంటే కళ్ళలో కారం పోసుకునేవాళ్ళు అడుగడుగునా. వీరికి అగ్రనాయకులు ఊరి పెద్దలే! పేరుకు పెద్దలేకాని నిజానికి గ్రద్దలు! మాలాంటి కణ్ణలేని వాళ్ళని ఎముకలతోసహా పీక్కుతింటూంటారు"—ఆయన ముఖం అసహ్యంతో నిండిపోయింది. ఒళ్ళుకూడా జలదరించింది.

"అలాంటి వాళ్లు మీ ఒక్కరి ఊళ్ళోనే అనడం దేనికి? అన్నిఊళ్ళలోనూ ఉన్నారు. మా ఊళ్ళోమాత్రం లేరా?"-అన్నాను ఆయన మాటలకి అడ్డొస్తూ.

"మీ ఊరుసంగతి నాకుతెలీదా? మాఊరుకంటే చాలానయం! మీ నాయనలాంటి వాడు ఒక్క పెద్దమనిషైనా మాఊళ్ళోఉంటే మరీ ఇంత అధ్వాన్నకాలం రాకపొయ్యేది. అంతా పగటిదొంగలు!"-కొంచెం ఆవేశంలోకి వచ్చాడాయన.

"ఏదోలెండి, అదంతా లోకంపోకడ. అసలు ఏం జరిగింది?"—నన్ను పట్టుకున్న సమస్యని త్వరగా పరిష్కరించమని బలవంత పెట్టా.

"ఏం జరిగిందంటే - మాఊరి గొల్లవాళ్ళు మొదట్నుంచీ కొంచెం పోకిరీవెధవలు. గొఱ్ఱెల్ని మేపటానికి వాళ్లకు సొంతభూములంటూ లేవు. బీడుభూములు కావాలంటే చేలుదాటి చాలా దూరం ఆ గుట్టలదాకా వెళ్లాలి. ఈ సోమరి పోతులు అక్కడిదాకా రోజూ వెళ్ళలేరు. అంచేత ఇక్కడిక్కడే ఎక్కడేనా చిన్నచిన్న పొలాలు బీడువడి ఉంటే వాటిల్లో మేపుకుంటారు. ఈ బీళ్ళలోని గడ్డి ఆ మందలకు ఏం చాలుంది? అందుకని ఎవరూలేని సమయం చూసి దగ్గరఉన్న చేలలోకి గొఱ్ఱెల్ని ఔర విడుస్తుంటారు. ఖర్మంచాలక ఎవరైనా చూసి పట్టుకుంటే 'మేం కాదు' అని తిరుగబడుతారు. ఇంకా మించితే అసలు వాడినే నాలుగు తంతారు. ఇదీ మాఊళ్ళో ఈ రోజుల్లో జరుగుతున్న చిత్రం! అయితే దీని కంతటికీ మూల కారకులు మాత్రం అధికారంలో ఉన్నవాళ్ళే. లంచాలకు మరిగి అన్యాయానికి ఎల్లప్పుడూ విజయం చేకూరుస్తుండడమే వాళ్ళ పని. అలాంటప్పుడు, ఇక న్యాయానికి నిలువ నీడెక్కడిది? ధర్మంగా నడిచేవాళ్లు ఎవరు ముందు పడతారు? కల్ల!...."

ఆయన కొంచెం ఆగాడు. ఇంతవరకూ చెప్పిన విషయాలు ఆయన చెప్పదలుచుకున్న కథానకానికి భూమిక అని గ్రహించుకున్నాను. ఈ లంచం అనే పిశాచం మూలాన్ని దేశం ఎంత దిగజారిపోతూందో ఊహించుకుంటే ఒక చిన్న నిట్టూర్పు వెలువడింది నాలోంచి.

ఆరంభించా డాయన "ఈ సంగతే ఆ చేను యజమానివట్ల జరిగింది. ఎక్కువ రోజులేమీ కాలేదు, నెల కావస్తుంది. ఎవరి చేని ప్రక్కనైనా బీడుపొలం ఉంటే, అతడు తనచేనును వేయికళ్ళతో చూనుకొంటూ ఉండాలి. లేకపోతే నిద్రపోయి లేచేవరకు అది ఉంటుందో లేదో చెప్పలేం. ఆ చేను యజమాని కోటయ్య- మా వీధిలోనే ఉంటాడు. పొలాలపైని వచ్చే ఆదాయం తప్పితే మరొకటిలేదు-తనూ, భార్యా, ఇద్దరు పిల్లలూ జీవించడానికి. ఇక అతని నడవడిని గురించి చెప్పవలసివస్తే తన బ్రతుకు తాను బ్రతకటమే ముఖ్యమైందిగా భావించే మనిషి. ఒకరితో పేచీఅంటే తెలీని సామ్యుడు.

ఒకనాటిమాట — అతను చేనిదగ్గర్నుండి ఇంటికి భోజనానికి వెళ్ళివుంటాడు. ఆ సమయం అందరూ సామాన్యంగా ఇళ్ళకు వెళ్ళేదే. కోటయ్య చేనుదగ్గరవున్న బీడును ఎప్పుడు చూశారో కాని, గొల్లవాళ్లు ఆ నాడు మందనంతటినీ తోలుకువచ్చారు. ఆ బీడులోకి పోవడానికి దారంటూ లేదు. ఇలా కొంచం లేచి నిల్చో బాబూ!"- అంటూ తనులేస్తూ నన్ను రెక్క పుచ్చుకు లేపాడు. ఇద్దరమూ నిలబడ్డాం మంచెమీద. అతడు ఒకవైపుకు వ్రేలెట్టి చూపుతూ, "అదుగో! ఆ క్రింది కందిచేను చివరని, బాటప్రక్కకి, చూస్తున్నావుగా బాబూ? అక్కడ, అవతలిచేనుకీ, ఇవతలిచేనుకీ మధ్య గట్టువుంది. అది ఇద్దరు మనుషులు జంటగా నడువగలిగే అంత విశాలంగాకూడా లేదు. దానిమీదినించి ఆ ముండాకొడుకులు మందని దాటించడానికి పూనుకున్నారు."

ఇద్దరమూ కూర్చున్నాం. ఆయన చెప్పుకు పోసాగాడు. అతని శైలి రమ్యంగా ఉంది. పల్లెటూళ్ళలో అంత మంచిగా మాట్లాడే వాళ్లని నేను చాలా అరుదుగా చూశాను. "అవేం మనుషుల్లాగు తెలివిగలవనా, ఒకదాని వెనక ఒకటి పోవడానికి? గొఱ్ఱెలు! తెలిసిన మన లాంటి మనుషులే ఒక్కోసారి పశువుల్లా ప్రవర్తిస్తారు. ఇక వాటి సంగతి వేరే ఏం చెప్పాలి? మంద పూర్తిగా ఆ గట్టుమీదినించి దాటేప్పుడు, గట్టు కిరువైపున ఉన్న చేలలో కొంత కొంత భాగం త్రొక్కుడు పడ్డది. చేను ఒకసారి త్రొక్కుడు పడ్డాక దాని గతి ఏమవుతుందో నీకు తెలుసు ననుకుంటాను. అక్కడ పశువుల జాడలు చూసి అందరూ దాన్ని బాట మాదిరిగా ఉపయోగించు కుంటారు. వస్తూ పోతూ పశువులు అక్కడొక మొక్కనీ, ఇక్కడొక మొక్కనీ ముట్టకండా ఉండలేవు దారి ప్రక్కన ఉన్న పొలాలకి కంచెలు పెట్టుకున్నా భద్రం కావడంలేదు. మా చేనే చూడు! దారి ప్రక్కన ఎన్ని మొక్కలు మొండ్లయి పోయినాయో!"

"అవును. వస్తూ వస్తూ అవన్నీ చూశాను. తరువాత ఏం జరిగింది?" అని అతని ధోరణిని మళ్ళీ అసలు విషయం పైకి మరల్చాను.

"ఆ సమయానికే ఇంటినించి కోటయ్య వచ్చాడు. వాళ్లు మందను దాటిస్తుంటే చూసి దూరం నించే కేకలు వేశాడు. కాని వాళ్లు విన్పించుకుంటేనా? దగ్గరికి వచ్చి త్రొక్కుడు పడ్డ చేనును చూసి బాధపడ్డాడు. గొల్లవాళ్ళ మీద కోపం వచ్చింది. వాళ్ళనడిగాడు, ఏం న్యాయమని? గట్టుమీది నించి దాటిస్తే ఏం పోయిందయ్యా? అని నిర్లక్ష్యంగా జవాబు చెప్పారు వాళ్లు. అందుకు కోటయ్య వాళ్లని నాలుగు తిడుతూ, దీనికి ఊర్లో పెద్ద మనుషులు తీర్పు చెప్పాలి. అంతదాకా మీ గొంగళ్లు ఇక్కడుంచండి—అంటూ వాళ్ళ భుజాలమీది గొంగళ్లు పట్టుకున్నాడు. వాళ్ళింకా రెచ్చిపోయి, మహా వచ్చావు లేవయ్యా భుజాలమీది గొంగళ్ళు గింజుకోడానికి మొగాడివి?, అంటూ అతణ్ణి నేలమీద పడత్రోశారు. కోటయ్య సర్దుకుని లేచి రెట్టించిన కోపంతో తిరిగి వాళ్ళని పట్టుకున్నాడు. వాళ్ళు అందరూ కలిసి అతణ్ణి బాగా కొట్టారు. ఒకడు రాత్తో గ్రుద్దడం మూలాన్ని తల పగిలి నెత్తురు కారసాగింది. పాపం! ఏంచెయ్యగలుగుతా డతను? మొత్తుకుంటూ రెడ్డిగారి దగ్గరికి పరుగెత్తాడు, తలను చేత్తో పట్టుకుని. తన పరిస్థితినంతా విన్నవించుకొన్నాడు రెడ్డిగారికి.

రెడ్డిగారు ఊరికి పెద్ద. తీర్పు కావలసిన వాళ్లంతా అతని దగ్గరికి పోతారు—పోవాలి. రెడ్డిగారి ధర్మవృత్తాన్ని చూసి సహించలేక ధర్మదేవత మా ఊరినించి ఏనాడో పలాయన మంత్రం పఠించింది. జరిగిన మేలంతా ఏమిటి అంటే, ఆయన తీర్పు చెప్పిన కలహాలు మాత్రం తిరిగి అంకురించలేదు. బుద్ధి కలిగిన ప్రతివాడూ తన కెంత అన్యాయం జరిగినా సహించడం నేర్చుకున్నాడు కాని ఫిర్యాదు చేసికోవడం, అదిన్నూ రెడ్డిగారి సమక్షాన మాత్రం తల పెట్టడు.

కోటయ్య గాథనంతా విని, 'సరే, నేను రిపోర్టు వ్రాస్తాను; నువు వెళ్లి తాలూకా కచేరీలో ఫిర్యాదు చేసుకో. ఆ ముండా కొడుకులు జైలుకు పోతారు,' అన్నాడు ఆయన. రెడ్డిగారు ప్రజాహితులయితే, ఆ గొల్లవాళ్ళని పిలిపించి, నాలుగు తన్నించి, కోటయ్యకు జరిగిన నష్టానికి పరిహారం ఇప్పించి ఉంటే అంత కంటే మించిన న్యాయం లేకపోయేది. కాని రెడ్డిగారలా ఎందుకు చేస్తారు? ధర్మమూర్తులు! అందుచేతే వెళ్ళి తాలూకా పోలీసు దఫ్తర్‌లో ఫిర్యాదు కమ్మన్నాడు.

కోటయ్య ఎంతటి అర్భకుడో మొదటే చెప్పాను. అతనికి ఆ కచేరీలూ. గొడవలూ ఏంతెలుసు? రెడ్డిగారేమో తీర్పు చెప్పరైరి. తన కేమో మరణ పర్యంతం జరిగింది. తత్కాలానికి కిమ్మనకండా ఉంటే తాను మరీ చులకనై పోతాడు గొల్లలకి. మున్ముందు చంపడానికి కూడా వెనుదీయరు. వాళ్ళకి తగిన శాస్తి చేయించకుంటే లాభంలేదు. అయితే తనకి ఆ పోలీసువాళ్ల గొడవలేమీ తెలీవు. ఏంచెయ్యాలి? ఏమీ తోచక ఏడుస్తూ రెడ్డిగారి కాళ్ళు రెండూ పట్టుకున్నాడు కోటయ్య-నాకేమీ తెల్యదురెడ్డీ! నేనింత వరకు కచేరి మొకమైనా చూళ్ళేదు. ఎట్లాగేనా మీరే ఒక మార్గం చూపెట్టండి—అంటూ. చివరకి 'సరే సాయంత్రం బస్సుకు వెడదాం, నేనుకూడా వస్తాను.' అన్నాడు రెడ్డి. కోటయ్య ఆసరా చిక్కిందని గుండె పదిలం చేసుకున్నాడు. ఆ సాయంత్రమే కోటయ్యని వెంబడించుకుని రెడ్డిగారు తాలూకాకు వెళ్లాడు. అక్కడ జరిగిన సంగతులు కోటయ్య ముఖతః వినవలసినదే కాని మాలాంటి వాళ్ళు చెబితే వాటిలోని స్వారస్యమే చెడిపోతుంది."

ఇక్కడ కొంచం ఆగి ఆయన చిన్నగా నవ్వాడు. ఆ నవ్వు శరదంబర చంద్రికలాగా నిర్మలంగా లేదు. వర్షాకాలంలో మేఘాచ్ఛన్నమైన ఆకాశంలో ఉన్న చంద్రుని వెన్నెలలాగా మసకగా,! మ్లానంగా ఉంది. ఆ నవ్వులో కోటయ్యమీది జాలీ, అతనికి అన్యాయం చేసిన వాళ్ళమీద ఒక రకపు ద్వేషమూ, న్యూనభావమూ ప్రస్ఫుటమైనై. "సరే. ఆ తరువాత ఏమైంది? ఇన్స్పెక్టరు వచ్చాడా?" అనడిగాను.

"ఏం జరుగుతుంది? వెళ్ళి, రెడ్డిగారి సహాయంతో పోలీసు అధికారికి జరిగిన సంగతంతా విన్పించాడు. అన్నీ వ్రాసుకున్నాట్ట అతను. ఆనాడు రాత్రికి తాలూకా పోలీసు కచేరీలో మూడు కోళ్ళు తెగినయి. పులావులూ, బిర్యానీలూ వండారు. రెడ్డిగారూ, అమీనూ, అతని పరివారమూ అందరూ బాగా మెక్కారు. ఖర్చు మాత్రం కోటయ్య నెత్తిమీద పడింది. చూడు! వాళ్ళు ఎంత దయామయులు! ఒకడు మరణ గండంలో ఉండి మొరెట్టుకోవడానికివస్తే వాడి పట్ల కన్పరచిన అనర్గళమైన అనుకంపా, అక్షయమైన రక్షణా! ఎంత బావుంది? అంతటితోనే ఆగలేదు. అంతటికంటే శోచనీయమైన విధంగా ప్రవర్తించారు. అమీనూ, రెడ్డిగారూ రహస్యంగా కచేరీకి పిలిపించుకున్న సాని పాపలకీ, వాళ్ళందరి త్రాగుళ్ళకీ డబ్బు కోటయ్యే చెల్లించుకోవాల్సి వచ్చిందట. పోలీసు అధికారి మర్రోజు సాయంత్రం ఊరికి వస్తానన్నాడట,తన భటులతో విచారణకి. అంతవరకు జరిగిన తతంగమే కోటయ్యకి విసుగు నెత్తించింది. మధ్యలో వదిల్తే ఎవరికెలాంటి ఆగ్రహంకలుగుతుందోనని ఊరుకున్నాడు. ఉదయమే రెడ్డిగారు ఊరికి వచ్చేశారు.

సాయంత్రం అమీను ఇద్దరు జవానులను వెంటబెట్టుకుని కోటయ్యతోసహా దిగాడు ఊర్లో. ఆయన వచ్చేలోగా వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఆ సాయంత్రంలోగా గొల్లవాళ్లు రెడ్డిగారికి కానుకలు—అవి లంచాలు అంటే బహిరంగంగా వాలాంటివాడి మూతి పండ్లూడదన్నిస్తారు చెప్పచేత — సమర్పించుకోవడం, ఎల్లాగైనా తమను కాపాడమని బ్రతిమాలుకోవడం జరిగింది. గొల్లల్ని అమీను ఎదుటికి తీసుకువచ్చారు జవాన్లు. వాళ్లు ఎదలకూ, శరీరంలోని ఇతర భాగాలకూ అక్కడక్కడ సున్నమూ బెల్లమూ రానుకుని వికృత వేషాలతో, బాధను నటిస్తూ హాజరయ్యారు. మొదట అమీనుకూడా ఆశ్చర్యపడ్డాడు. కోటయ్యకి కోట పెట్టినట్లుగానే తోచింది. రెడ్డిగారివైపు సంగతేమిటని అమీను అర్థయుక్తంగా అవలోకించేసరికి ఆయన అమీనుతో ఉర్దూలో ఏమేమో మాట్లాడాడట. లోపలికి తీసికెళ్ళి రహస్యంగా ఏమేమి చెప్పాడో తెలీదు. ఆఖరుకు కోటయ్యను చూపిస్తూ రెడ్డిగారు 'ఏహ్ పక్కా బద్మాష్ హై' అన్నాడట. ఆ మాటకి అర్థం కోటయ్య గ్రహించి వెలవెలబోయాడు. ఏదిగతి దైవమా అని వాపోయాడు.

రాత్రికి గొల్లవాళ్లని పొమ్మన్నారు. కోటయ్య మాత్రం 'రక్షక భటుల' కావలాలో ఉంచబడ్డాడు. అమీను ఆ రాత్రంతా అతణ్ణి బాగా బాధించాడు. చివరికి నేరం కోటయ్యమీదే మోపాడు. కోటయ్యే గొల్లవాళ్ళమీద చేయిచేసుకుని వాళ్ళను కొట్టినట్లూ, వాళ్ళకు తగిలిన గాయాల్లో అతని తగిలినవి ఒక్క అంశంకూడా కావనీ, అంచేత ఉదయం బేడీలువేసి జైలుకి తీసుకువెడతాననీ బెదరించాడు. ఊర్లో జరిగే అల్లరులన్నిటికీ కోటయ్యే కారకుడైనట్లు తనకు బలమైన సాక్ష్యం దొరికిందన్నాడు అమీను. కోటయ్యకు ఎటూదిక్కు తోచలేదు. ఎవరికి చెప్పకోవాలో తెలిలేదు. తనేమీఎరుగనని నెత్తీ నోరూ కొట్టుకొన్నాడు.కాని అతని శోకానికి కరిగే గుండె అమీనుకు లేకపోయింది. ఊరికి పెద్దమనిషీ, న్యాయం చెప్పవలసినవాడూ ఐన ఆ రెడ్డిగారికే నీతీ నిజాయితీ లేకపోతే, డబ్బుకి కక్కుర్తి పడే ఎవడో పరాయివాడు, వాడి లెఖ్ఖేమిటి? పర్యవసానంలో రెండువందల రూపాయలు ఇస్తే విడుస్తానన్నాడు అమీను. లేకపోతే తీసికెళ్ళి జైల్లో పడవేయిస్తా నన్నాడు,

తనను పట్టుకెళ్ళటానికి తగిన కారణాలూ, శిక్ష విధించడానికి తగిన నేరాలూ ఉన్నట్లు కోటయ్యకి తెలీవు. అతను అలాంటివి చేసి వుంటేగా తెలియడానికి? కాని రెడ్డిగారూ, అమీనూ తల్చుకుంటే అదెంతపని? అసలు ప్రభుత్వం అతణ్ణి ఏ ఖానూను ప్రకారం జైల్లో వేస్తుందో అతనికేగాదు, మాక్కూడా తెలీదు.... కోటయ్య గౌరవంగా బ్రతికిన మనిషి అంతే పెద్దపెద్దవాళ్ళలో తిరిగి సమ్మానాలు పొందకపోయినా నీచపుపనులు చేసి అవమానాలు పొందినవాడు మాత్రం కాదు. తను జైలుకు వెడితే తన పిల్లలూ, భార్యా ఏమైపోతారా అని తోచేసరికి హడలిపోయాడు. గత్యంతరంలేక

అధికారి మాటకు ఒప్పుకున్నాడు.'' ఇలా కథని ముగిస్తూ బరువైననిట్టూర్పొకటి వదిలాడాయన.

నేను మ్రాన్పడి కూర్చున్నాను. నాగుండె వర్షామేఘంలా బరువెక్కిపోయింది. కళ్ళలోంచి అశ్రువులు రాలిపడినయి. ''ఇదంతా కాల ప్రభావం బాబూ! మనమేమీ చెయ్యలేం'' ఓదార్చారాడాయన నన్ను.

''సరే, వస్తాను.'' అంటూ లేచాను.

''పొద్దు గూకుతూంది. జొన్న కండెలు తింటావా?'' అనడిగాడాయన. నేను వద్దన్నాను. విషాదాన్ని కావలసినంత తిన్నాను.

సెలవు తీసుకుని చేలమధ్య నడుస్తున్నాను. సూర్యుడు పడమట అస్తమిస్తున్నాడు. ఎఱ్ఱగా, మానవుణ్ణి పశువుగా మార్చే బంగారు కాసు లాగున్నాడు. నజ్జనవధ కారణంగా పారిన రక్తంలా పరచుకుంది, సాయంకాలపు ఎండ. సస్యభరితమైన పుడమితల్లి పాపభరంతో వంగి పోయినట్లుగా ఉంది. నేను భారంగా ఇంటి వైపు అడుగుల్ని ఒక్కొక్కటే వేస్తూ నడుస్తున్నాను.

★

---

## (16-వ పేజీ తరువాయి)

భ్రమసి పోతాయి. కంటిపాప ముడుచుకుని, చిన్నదవుతుంది. కళ్లుకూడా మూతపడతాయి. మనం పెద్ద వెలుగులోనుంచీ చీకటి గదిలోకి వెళ్ళితే, కాస్సేపు ఏమీ కనబడదు. కన్ను పొడుచుకున్నా కనపడని చీకటి అంటారు కదూ? ఎక్కువ వెలుతురుచూసిన రెటీనా అలసిపోతుంది. కాస్సేపు విశ్రాంతి ఉంటేనే గానీ, చీకట్లో చూపు స్పష్టంగా వుండదు. వెలుతురు తక్కువగా ఉంటే కంటిపాప పెద్దదవుతుంది.

మరొక తమాషా. మనం కనుచూపుమేరలో ఉండే ఏ వస్తువునైనా స్పష్టంగా చూడగలం. మనం దూరపు వస్తువులమీద చూపు నిలుపుతా మనుకుందాం. ఆ వస్తువులన్నీ చక్కగా కనబడతాయి. వెంటనే దగ్గరి వస్తువులను చూస్తే, కంటిలో కొన్నిమార్పులు జరుగుతాయి. ముఖ్యంగా కంటిలోని మాంసపు కటకం ఆకారం మారుతుంది. దీనివల్ల దగ్గరి వస్తువులు కూడా స్పష్టంగా కనపడతాయి. నలభయ్యో పడి దగ్గరపడేకొద్దీ ఈ శక్తి క్రమేణా తగ్గటం ప్రారంభిస్తుంది. దీనినే మనం చత్వారం అంటాం—తెలుసుగా?

ప్రపంచం ఒక సీతాకోక చిలుక. ఇది రంగురంగుల ప్రపంచం. కొన్ని వస్తువులు ఎఱ్ఱగా ఉంటాయి. కొన్ని పచ్చవి. కొన్ని నీలి రంగువి. ఈ రంగులను మనం ఎలా చూడగలుగుతున్నాం? ఈ విషయంలో అనేక పరిశోధనలూ, చర్యలూ, వాద వివాదాలూ జరుగు తున్నాయి. రెటీనాలో ''రాడ్స్'' అనీ, ''కోన్స్''అనీ ఉంటాయనీ, ఇవి చక్షుర్జ్ఞానానికీ, వర్ణజ్ఞానానికీ తోడ్పడతాయని అంటారు. కన్ను ఎరుపును, ఆకుపచ్చనూ, నీలాన్ని పొడకట్ట గలిగితే, మిగతా రంగులన్నింటినీ ఈ మూడింటినీ రకరకాలుగా వేరువేరు పాళ్ళలో కలిపి చూడవచ్చునని కొందరి అభిప్రాయం. మరి కొందరు నాలుగు రంగులు ఉంటేనేగానీ వర్ణజ్ఞానం కలగదని అంటారు. ఆ తగాదాలన్నీ మనకెందుకూ? మనం ఇంద్రధనుస్సు రంగుల అందాన్నీ, నెమలి పింఛపు వర్ణ సౌందర్యాన్నీ చూసి ఆనందించగలుగుతున్నాం, అదే పదివేలు!

కళ్లు లోకోక్తులలోకి కూడా ఎక్కాయి సుమండీ. సుందరానికి గర్వం వచ్చిందంటే లోకం ఏమన్నది? ''సుందరానికి కళ్లు నెత్తికెక్కాయ్!'' అన్నది. వాడికి కన్నూ మిన్నూ తెలీటంలేదు.

చూశారా, కన్నులో ఎంత అందం ఇమిడి ఉందో, ఎంత కళ ఇమిడిఉందో, ఎంత శాస్త్ర పరిజ్ఞానం ఇమిడిఉందో? నిజానికి, కన్నులో గల లాలిత్యంకానీ, సౌందర్యంకానీ, సంశ్లిష్టత కానీ, విశిష్టతకానీ మరే ఇంద్రియానికి ఉన్నది చెప్పండి? కన్ను ఉంటేనే వెలుగు. కన్ను ఉంటేనే లోకం కన్ను ఉంటేనే జ్ఞానం. కన్ను లేకపోతే అంతా గాఢాంధకారమే; ప్రపంచం అంతా అంధకార బంధురమే!

★